
విజృంభించిన కంబోజ్, అర్ష్‌దీప్, బ్రార్..విరాట్ సూపర్ ఇన్నింగ్..

కివీస్‌తో తొలి వన్డేలో భారత్ ఘనవిజయం

విశ్వంభర, స్పోర్ట్స్: ఫార్మాట్ మారినా.. ఆరంభం భారత్‌దే. న్యూజిలాండ్ పర్యటనలో టీ20 సమరాన్నే కాదు.. వన్డే పోరును కూడా విజయంతోనే ఆరంభించింది టీమ్‌ఇండియా. కొన్ని రోజుల ముందు టీ20 మ్యాచ్‌లో చిత్తుగా ఓడిన ఆక్లాండ్‌లో.. ఆతిథ్య జట్టుపై అలవోకగా గెలిచింది. బలహీనమనుకున్న పేస్ బౌలింగే బలంగా మారడంతో కివీస్‌ను తక్కువ స్కోరుకే కూల్చేసిన శుభ్‌మన్ సేన.. సీనియర్ బ్యాటర్ విరాట్ కోహ్లి తన క్లాస్‌ను చూపిస్తూ చెలరేగిపోవడంతో అయిదు వన్డేల సిరీస్‌ను ఘనవిజయంతో మొదలుపెట్టింది.







న్యూజిలాండ్ పర్యటనలో ఇప్పటికే టీ20 సిరీస్‌ను చేజిక్కించుకున్న టీమ్‌ఇండియా.. వన్డే సిరీస్‌లోనూ శుభారంభం చేసింది. బుధవారం వర్ష ప్రభావిత తొలి వన్డేలో భారత్ 5 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. మొదట 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అన్షుల్ కంబోజ్ (2/22), అర్ష్‌దీప్ సింగ్ (4/70), గుర్నూర్ బ్రార్ (3/44) త్రయం ధాటికి కివీస్ 40.2 ఓవర్లలో 185 పరుగులకే కుప్పకూలింది. టిమ్ సీఫర్ట్ (38; 43 బంతుల్లో 3ఐ4, 2ఐ6) టాప్‌స్కోరర్. అనంతరం భారత ఇన్నింగ్స్ మధ్యలో వర్షం వల్ల లక్ష్యాన్ని 32 ఓవర్లలో 143కు సవరించగా.. భారత్ 22.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. విరాట్ కోహ్లి(74; 51 బంతుల్లో 13ఐ4, 1ఐ6) సూపర్ ఇన్నింగ్స్ ఆడగా.. శుభ్‌మన్ గిల్ (37; 56 బంతుల్లో 5ఐ4) కూడా రాణించాడు. కివీస్ బౌలర్లలో జాకబ్ డఫీ (3/49) ఆకట్టుకున్నాడు.రెండో వన్డే శనివారం జరుగుతుంది.

కింగ్ కమాల్..

రెండుజట్లలో మిగతా ప్రధాన బ్యాటర్లందరూ తడబడ్డారు. ఎవ్వరూ 50 మార్కును అందుకోలేదు. అడ్డదిడ్డంగా షాట్లు ఆడిన కివీస్ టెయిలెండర్ టిక్నర్‌ను మినహాయిస్తే.. ఒక మోస్తరు స్కోరు చేసిన వాళ్లెవరూ బంతికో పరుగు కూడా తీయలేకపోయారు.పిచ్‌బ్యాటర్లకు అంతగా పరీక్ష పెట్టింది. ఫాస్ట్‌బౌలర్లను ఎదుర్కోవడం పెద్ద సవాలుగా మారింది. కానీ కోహ్లికి మాత్రం పిచ్, బౌలర్లు పెద్ద సమస్య కాలేదు. కఠిన పరిస్థితుల్లో అత్యుత్తమ షాట్లు ఆడుతూ ఛేదనను నడిపించిన తీరు అమోఘం. కవర్స్‌లో ఆడిన డ్రైవ్, లాఫ్టెడ్ షాట్.. గిర్రున తిరుగుతూ కొట్టిన పుల్ షాట్లు.. ముందుకొచ్చి బౌలర్ తలమీదుగా ఆడిన బౌండరీ.. ఇలా విరాట్ ఆడిన వాటిలో ఏ షాట్‌కు ఆ షాట్ ప్రత్యేకం. ఛేదన ఆరంభంలోనే.. జేమీసన్ బౌలింగ్‌లో ఆడాలా వద్దా అన్న సంశయంలో షాట్ ఆడిన రోహిత్ శర్మ (0) బైటైపోవడంతో భారత్‌కు గట్టి ఎదురు దెబ్బ తగిలింది.

కివీస్ ఇన్నింగ్స్‌లో పేసర్లు చెలరేగిన తీరు చూస్తే.. లక్ష్యం చిన్నదే అయినా ఛేదన తేలిక కాదనిపించింది. కానీ ఆరంభంలో కాసేపు ఆచితూచి ఆడిన విరాట్, కుదురుకున్నాక స్వేచ్ఛగా షాట్లు ఆడడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. అయితే వర్షం అతడి జోరుకు అడ్డుకట్ట వేసింది. 11వ ఓవర్లో గంట పాటు ఆగిన ఆట.. కొన్ని బంతులు పడ్డాక ఇంకో 40 నిమిషాల పాటు నిలిచిపోయింది. దీంతో అంపైర్లు లక్ష్యాన్ని సవరించారు. తిరిగి ఆట మొదలయ్యాక కోహ్లి రెచ్చిపోవడంతో స్కోరు 100 దాటింది. మరో ఎండ్‌లో ఆచితూచి ఆడిన శుభ్‌మన్, వీలుచిక్కినపుడు షాట్లు కొట్టాడు. 18 ఓవర్లలో 114/1తో భారత్ విజయానికి చేరువ కాగా.. తర్వాతి 5 ఓవర్లు, 23 పరుగుల తేడాలో 4 వికెట్లు పడిపోయాయి. ముందుగా శుభ్‌మన్‌ను నాథన్ స్మిత్ ఔట్ చేయగా.. డఫీ ధాటికి కోహ్లి, అక్షర్ (0), శ్రేయస్ (15) పెవిలియన్ చేరారు. అయినా ఓవర్లు చాలానే అందుబాటులో ఉండడంతో తేలిగ్గానే భారత్ పని పూర్తయింది.

కట్టిపడేశారు..

ఈ సిరీస్ ఆరంభానికి ముందు భారత్‌కు పేస్ బౌలింగే పెద్ద సమస్య అవుతుందని అన్నారు విశ్లేషకులు. బుమ్రాతో పాటు ప్రసిద్ధ్ కూడా అందుబాటులో లేని నేపథ్యంలో.. ఉన్న వాళ్లలో అనుభవజ్ఞుడైన సిరాజే ఆదుకోవాలనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కానీ ఈ మ్యాచ్‌కు సిరాజ్‌కు తుది జట్టులో చోటే దక్కలేదు. పెద్దగా అనుభవం లేని అర్ష్‌దీప్, కంబోజ్, గుర్నూర్‌లే అద్భుత బౌలింగ్‌తో జట్టు విజయానికి బాటలు వేశారు. నాలుగు రోజుల ముందు ఇదే వేదికలో జరిగిన నాలుగో టీ20లో కివీస్ సాధించిన స్కోరు 259. కానీ బుధవారం మాత్రం భారత పేసర్లు చెలరేగిపోయారు. ముఖ్యంగా అన్షుల్ కంబోజ్ అయితే కివీస్ బ్యాటర్లను ఉక్కిరిబిక్కిరి చేశాడు. చేంజ్ బౌలర్‌గా వచ్చిన అతను.. రెండు స్పెల్స్‌లో 10 ఓవర్లలో 2 మెయిడెన్లు వేసి, 22 పరుగులే ఇచ్చి 2 వికెట్లు పడగొట్టాడు. అయితే టాస్ గెలిచి బౌలింగ్ చేసిన భారత్‌కు అదిరే ఆరంభాన్నిచ్చింది మాత్రం అర్ష్‌దీపే. యంగ్ (9), నికోల్స్ (9)లను ఔట్ చేసి కివీస్‌ను గట్టి దెబ్బే తీశాడతను. అతడితో కొత్త బంతిని పంచుకున్న ఆకిబ్ నబి పొదుపుగానే బౌలింగ్ చేసినా.. వికెట్ తీయలేకపోయాడు. కానీ కంబోజ్‌తో కలిసి స్పెల్ వేసిన గుర్నూర్.. ఓ ఎండ్‌లో నిలకడగా ఆడుతున్న సీఫర్ట్‌తో పాటు లేథమ్ (3)ను ఔట్ చేసి కివీస్‌నుమరింత కష్టాల్లోకి నెట్టాడు.మిచెల్ (28).. రోహిత్ అద్భుత ఫీల్డింగ్ విన్యాసానికి వెనుదిరగాల్సి వచ్చింది. ఆల్‌రౌండర్లు శాంట్నర్ (4), నాథన్ స్మిత్ (1)లను కంబోజ్ ఔట్ చేయడంతో కివీస్ ఒక దశలో 115/7తో పతనం దిశగా సాగింది. ఈ దశలో ఫిలిప్స్ (30) కాస్త నిలబడి స్కోరు పెంచే ప్రయత్నం చేశాడు. అతను ఔటయ్యాక టిక్నర్ (34; 23 బంతుల్లో 1ఐ4, 4ఐ6) బ్యాట్ ఝళిపించాడు. డఫీ (15 నాటౌట్)తో పదో వికెట్‌కు అతను 39 పరుగులు జోడించాడు. అర్ష్‌దీప్ ఓవర్లో మూడు సిక్సర్లు బాదడంతో తన గణాంకాలు మారిపోయాయి.

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: యంగ్ (సి) శ్రేయస్ (బి) అర్ష్‌దీప్ 9; సీఫర్ట్ (సి) రుతురాజ్ (బి) బ్రార్ 38; నికోల్స్ (సి) నమన్ (బి) అర్ష్‌దీప్ 9; మిచెల్ రనౌట్ 28; లేథమ్ (సి) అండ్ (బి) బ్రార్ 3; ఫిలిప్స్ (సి) శ్రేయస్ (బి) అర్ష్‌దీప్ 30; శాంట్నర్ (బి) కంబోజ్ 4; నాథన్ స్మిత్ (సి) కోహ్లి (బి) కంబోజ్ 1; జేమీసన్ (సి) కోహ్లి (బి) అర్ష్‌దీప్ 1; డఫీ నాటౌట్ 15; టిక్నర్ (సి) రాహుల్ (బి) బ్రార్ 34; ఎక్స్‌ట్రాలు 13 మొత్తం: (40.2 ఓవర్లలో ఆలౌట్) 185; వికెట్ల పతనం: 1-22, 2-40, 3-73, 4-84, 5-97, 6-113, 7-115, 8-131, 9-146; బౌలింగ్: అర్ష్‌దీప్ 10-0-70-4; ఆకిబ్ నబి 6-0-33-0; అన్షుల్ కంబోజ్ 10-2-22-2; గుర్నూర్ బ్రార్ 9.2-0-44-3; అక్షర్ పటేల్ 5-0-12-0

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) శాంట్నర్ (బి) జేమీసన్ 0; గిల్ (సి) లేథమ్ (బి) స్మిత్ 37; కోహ్లి (సి) సీఫర్ట్ (బి) డఫీ 74; శ్రేయస్ (సి) నికోల్స్ (బి) డఫీ 15; అక్షర్ (సి) ఫిలిప్స్ (బి) డఫీ 0; రాహుల్ నాటౌట్ 3; నమన్ నాటౌట్ 5; ఎక్స్‌ట్రాలు 9 మొత్తం: (22.4 ఓవర్లలో 5 వికెట్లకు) 143; వికెట్ల పతనం: 1-1, 2-114, 3-124, 4-124, 5-136; బౌలింగ్: జేమీసన్ 7-0-34-1; డఫీ 7-0-49-3; టిక్నర్ 4-0-38-0; నాథన్ 4.4-0-21-0

ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ.. ఫైనల్లో భారత్

సెమీస్‌లో 8-1తో కొరియాపై ఘనవిజయం



విశ్వంభర, మొహాలి:

సూపర్ ఫామ్‌ను కొనసాగించిన భారత జట్టు ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ హాకీ ఫైనల్‌కు దూసుకెళ్లింది. బుధవారం ఏకపక్షంగా సాగిన సెమీఫైనల్లో 8-1తో దక్షిణ కొరియాను చిత్తు చేసింది. శివానంద్ లక్రా (4వ, 13వ), దిల్‌ప్రీత్ (21వ, 25వ) చెరో రెండు గోల్స్‌తో భారత్ విజయంలో కీలక పాత్ర పోషించారు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ (9వ), సుఖ్‌జీత్ సింగ్ (21వ), అంగద్‌బీర్ సింగ్ (36వ), వికేక్ సాగర్ ప్రసాద్ (54వ) తలో గోల్ కొట్టారు. భారత్ అర్ధభాగానికే 6-1తో ఆధిక్యంలో నిలిచింది. ఈ మ్యాచ్‌లో ఆ జట్టు మొత్తం నాలుగు పెనాల్టీ కార్నర్‌లు సంపాదించింది. ప్రత్యర్థికి ఒక్కటీ రాలేదు. భారత్ ఈ టోర్నీలో ఫైనల్ చేరడం ఇది ఏడోసారి. కొరియా తరఫున నమోదైన ఏకైక గోల్‌ను సంగ్‌జూన్ హాన్ (9వ) సాధించాడు. రౌండ్ రాబిన్ దశలో భారత్ 8-0తో కొరియాను చిత్తు చేసిన సంగతి తెలిసిందే. ఈ టోర్నీలో ఇప్పటివరకు ఓటమెరుగని ఇండియా.. గురువారం జరిగే ఫైనల్లో జపాన్‌ను ఢీకొంటుంది. మరో సెమీఫైనల్లో జపాన్ పెనాల్టీ షూటౌట్‌లో 5-3తో మలేసియాపై విజయం సాధించింది.

ఇప్పుడు విజయాలు మరింత తీపిగా అనిపిస్తున్నాయి



విశ్వంభర, ఢిల్లీ: బ్యాడ్మింటన్ ఆట అనుక్షణం మారుతూనే ఉంటుందని.. కోర్టులో సహనంగా ఉండటం అత్యంత కీలకమని స్టార్ షట్లర్ పి.వి.సింధు తెలిపింది. బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ టూర్ క్వాలిఫయింగ్ ర్యాంకింగ్స్‌లో అయిదో స్థానంలో నిలిచిన 31 ఏళ్ల సింధు.. డిసెంబరు 9 నుంచి 13 వరకు జరిగే ఫైనల్స్‌కు అర్హత సాధించింది. "ప్రపంచ ర్యాంకింగ్స్‌లో టాప్-6లోకి రావడం చాలా సంతోషంగా ఉంది. టోర్నీల్లో గెలుస్తున్నప్పుడు కేవలం ర్యాంకింగ్ గురించి ఆలోచించాల్సిన అవసరం లేదు. దేహాన్ని జాగ్రత్తగా చూసుకోవడం ముఖ్యం. 30, 31, 32 ఏళ్ల వయసులోనూ ఎంతోమంది క్రీడాకారులు అగ్రస్థానాల్లో నిలిచారు. కాబట్టి నేను మళ్లీ అగ్రస్థానానికి ఎందుకు చేరుకోకూడదు? నేను ఆ దిశగానే పయనిస్తున్నా. 31 సంవత్సరాలు అన్నది కొత్తగా 21 ఏళ్లు అన్నట్లు. 21 ఏళ్లప్పుడు మ్యాచ్‌లో ఓడితే తీవ్ర నిరాశ, కోపం వచ్చేవి. ఎందుకలా జరుగుతుందో అర్థమయ్యేది కాదు. కానీ ఇప్పుడు ఆటలోని సవాళ్లు, మానసిక స్థితి, పొరపాట్లను స్పష్టంగా అర్థం చేసుకోగలుగుతున్నా. అందుకే ఇప్పుడు విజయాలు మరింత తీపిగా అనిపిస్తున్నాయి" అని చెప్పింది. 25 సెకన్ల షాట్ క్లాక్ నిబంధనపై ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) సమీక్షించాలని సింధు కోరింది. "షాట్ క్లాక్ నిబంధనను బీడబ్ల్యూఎఫ్ సమీక్షించాల్సిన అవసరముంది. సుదీర్ఘ ర్యాలీ ఆడిన తర్వాత క్రీడా కారులు అలసిపోతారు. మేమూ మనుషులమే అన్న విషయాన్ని గ్రహించాలి. ర్యాలీ ముగిసిన 25 సెకన్ల వ్యవధిలోనే సర్వీస్ చేయకపోతే ఎల్లో, రెడ్ కార్డులు ఇవ్వడం సరికాదు. ఫ్రెంచ్ ఓపెన్ సెమీస్‌లో 19-19 పాయింట్ల వద్ద ఫ్రాన్స్ జోడీకి రెడ్ కార్డ్ పెనాల్టీ విధించారు. దీంతో చైనా జోడీ మ్యాచ్ గెలిచింది. ఇలాంటి నిబంధనలపై సమీక్ష జరగాలి" అని తెలిపింది. భారత స్టార్ క్రికెటర్ తనకు ఎంతో స్ఫూర్తినిచ్చాడని సింధు చెప్పింది. "కుంగుబాటులో ఉన్నప్పుడు విరాట్ కోహ్లితో మాట్లాడాను. అతను నాకు ఎంతో స్ఫూర్తినిచ్చాడు. క్లిష్ట సమయాల్లో మనల్ని మనం ఎలా రీఛార్జ్ చేసుకోవాలి.. ఆటను ఎలా ఆస్వాదించాలో చెప్పిన విషయాలు నాకు బాగా ఉపయోపడ్డాయి" అని సింధు వివరించింది.

యూత్ ఒలింపిక్స్.. ఫైనల్లో తన్వి పాత్రి



విశ్వంభర, స్పోర్ట్స్: యూత్ ఒలింపిక్స్‌లో భారత అమ్మాయి తన్వి పాత్రి చరిత్ర సృష్టించింది. ఈ క్రీడల్లో మహిళల సింగిల్స్ బ్యాడ్మింటన్‌లో ఫైనల్ చేరిన భారత తొలి క్రీడాకారిణిగా రికార్డులకెక్కింది. ఆమె బుధవారం హోరాహోరీగా సాగిన సెమీఫైనల్లో 21-14, 11-21, 21-19తో యుజునో వతానబె (జపాన్)ను ఓడించి, తుది పోరుకు అర్హత సాధించింది. తొలి గేమ్‌ను సులువుగానే గెలుచుకున్న తన్వి.. రెండో గేమ్‌లో తేలిపోయింది. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో పట్టువదలని తన్వి విజయం సాధించి ఫైనల్ చేరింది. గురువారం ఆమె పసిడి కోసం పోరాడనుంది. తన్వి కంటే ముందు భారత్ నుంచి యూత్ ఒలింపిక్స్‌లో ముగ్గురు సెమీస్ చేరారు. వారిలో ప్రణయ్ (2010లో), లక్ష్య (2018లో) రజతాలు చేజిక్కించుకోగా.. ఆదిత్య పతకం అందుకోలేకపోయాడు.

హాకీలో హర్మన్‌ప్రీత్ సేన జోరు.. ఫైనల్‌కు భారత్

విశ్వంభర, స్పోర్ట్స్: ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీలో భారత పురుషుల హాకీ జట్టు అదరగొట్టింది. సెమీఫైనల్లో 8-1 గోల్స్‌తో దక్షిణ కొరియాపై ఘన విజయం సాధించి ఫైనల్లో అడుగుపెట్టింది. ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన భారత్.. ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. అటు డిఫెన్స్‌లోనూ, ఇటు గోల్స్ చేయడంలోనూ సమష్టిగా రాణించి అద్భుతమైన విజయాన్ని ఖాతాలో వేసుకుంది. భారత్ తరఫున షిలానంద్ లక్రా (2), దిల్‌ప్రీత్ సింగ్ (2), హర్మన్‌ప్రీత్‌సింగ్, సుఖ్‌జీత్ సింగ్, అంగద్ బీర్ సింగ్, వివేక్ ప్రసాద్ ఒక్కో గోల్ చేశారు. దక్షిణ కొరియా తరఫున హాన్ సాంగ్‌జున్ ఒక గోల్ చేశాడు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ నేతృత్వంలోని భారత జట్టు లీగ్ దశలోనూ అజేయంగా నిలిచింది. ఐదు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించి 15 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. తాజాగా సెమీస్‌లోనూ అదే జోరు కొనసాగించి టైటిల్ పోరుకు దూసుకెళ్లింది. గురువారం జరగనున్న ఫైనల్‌లో జపాన్‌తో భారత్ తలపడనుంది.



రో-కో అద్భుత ఫీల్డింగ్ విన్యాసాలు



విశ్వంభర, స్పోర్ట్స్: రోహిత్ శర్మ ప్రస్తుతం 40వ పడిలో ఉన్నాడు. కోహ్లికేమో గురువారమే 38 ఏళ్లు నిండబోతున్నాయి. కానీ మైదానంలో వీళ్లిద్దరి చురుకుదనం చూస్తే మాత్రం పాతికేళ్ల కుర్రాళ్ల ను చూస్తున్నట్లే ఉంది అభిమానులకు. బుధవారం రో-కో అద్భుత ఫీల్డింగ్ విన్యాసాలతో ఔరా అనిపించారు. న్యూజిలాండ్ ఇన్నింగ్స్‌లో నిలకడగా ఆడుతున్న మిచెల్‌ను రనౌట్ చేసి మ్యాచ్‌ను మలుపు తిప్పింది రోహితే. షార్ట్ మిడ్‌వికెట్‌లోకి బంతిని నెట్టిన ఫిలిప్స్ సింగిల్ దొంగిలించే ప్రయత్నం చేయగా.. మెరుపు వేగంతో స్పందించిన రోహిత్, రెప్పపాటులో బంతిని వికెట్ కీపర్‌కు చేర్చి మిచెల్‌ను పెవిలియన్ చేర్చాడు. ఇక కంబోజ్ బౌలింగ్‌లో నాథన్ స్మిత్ క్యాచ్‌ను స్లిప్‌లో కుడివైపు డైవ్ చేస్తూ కోహ్లి ఒంటి చేత్తో అందుకున్న తీరూ అద్భుతమే. వయసు ఒక అంకె మాత్రమే అని రుజువు చేస్తూ రో-కో చూపిన చురుకుదనం అభిమానులను అమితంగా ఆకట్టుకుంది. తర్వాత రోహిత్ బ్యాటింగ్‌లో విఫలమైనప్పటికీ కోహ్లి మాత్రం బౌలర్ల ఆధిపత్యం సాగిన మ్యాచ్‌లో అద్భుత షాట్లతో ఆకట్టుకున్నాడు.

జనవరి14 నుంచి డబ్ల్యూపీఎల్

ముంబయి: మహిళల ప్రిమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) మళ్లీ వచ్చేస్తోంది. డబ్ల్యూపీఎల్ 2027 సీజన్ జనవరి 14 నుంచి ఫిబ్రవరి 7 వరకు జరుగుతుంది. బీసీసీఐ బుధవారం టోర్నీ పూర్తి షెడ్యూలును ప్రకటించింది. మ్యాచ్‌లకు వదోదర, ముంబయి ఆతిథ్యమిస్తాయి. ఒక్కో నగరంలో 11 మ్యాచ్‌లు జరుగుతాయి. జనవరి 14న డిఫెండింగ్ ఛాంపియన్ బెంగళూరు, ముంబయి ఇండియన్స్ మధ్య మ్యాచ్‌తో లీగ్ మొదలవుతుంది. మ్యాచ్‌లన్నీ రాత్రి 7.30కు ఆరంభమవుతాయి. ముంబయిలో ఫిబ్రవరి 5న ఎలిమినేటర్, ఫిబ్రవరి 7న ఫైనల్ జరుగుతాయి.

వాళ్లిద్దరు నా ఫేవరెట్ కెప్టెన్లు : సచిన్

స్పోర్ట్స్ : భారత మాజీ కెప్టెన్లు సౌరవ్ గంగూలీ, ఎం.ఎస్ ధోనీ తనకు ఇష్టమైన కెప్టెన్లు అని దిగ్గజ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ తెలిపాడు. సోషల్ మీడియాలో ఓ అభిమాని అడిగిన ప్రశ్నలకు సచిన్ సమాధానమిచ్చాడు. 'భారత జట్టు టెస్టుకు కెప్టెన్‌గా మీకు ఎదురైన అనుభవం ఎలాంటిది?. ఆ రూల్‌కు అలవాటు పడటానికి మీకు కష్టం అనిపించిందా? దక్షిణాఫ్రికా కెప్టెన్‌గా టెంబా బవుమా ఎలా రాణిస్తున్నాడు? మీరు కలిసి ఆడిన కెప్టెన్లలో వ్యక్తిగతంగా అత్యంత ఇష్టమైన కెప్టెన్ ఎవరు?'అని ఆ అభిమాని సచిన్‌ను అడిగాడు.ఈ ప్రశ్నలకు సచిన్ బదులిస్తూ.. 'జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించడం గొప్ప గౌరవం. అయితే నేను కెప్టెన్‌గా ఉన్నప్పుడు జట్టును నాకు నచ్చినట్టు ఎంచుకునే స్వేచ్ఛ అప్పట్లో లేదు. 1990తో పోలిస్తే నేడు బీసీసీఐ పనితీరు చాలా మారింది. ఆ కాలంలో భారత క్రికెట్ అత్యంత క్లిష్టమైన, చీకటి దశను ఎదుర్కొంది. టెంబా బవుమా దక్షిణాఫ్రికా క్రికెట్ జట్టును అద్భుతంగా నడిపిస్తున్నాడు. దక్షిణాఫ్రికా ఐసీసీ టైటిల్ గెలవడంలో వరల్డ్ క్రికెట్‌కు చాలా గొప్ప విషయం. నాకు ఇష్టమైన కెప్టెన్లు సౌరవ్ గంగూలీ, ఎం.ఎస్ ధోనీ. ఈ ఇద్దరూ కచ్చితంగా నా జాబితాలో అగ్రస్థానంలో ఉంటారు.'అని సచిన్ చెప్పాడు.